క్లుప్తంగా

ఇంగ్లిష్‌లోనే బోధన చేయాలి

కొమరాడ: విద్యార్థులకు కచ్చితంగా ఇంగ్లిష్ లోనే బోధన చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. వసతిగృహం, భోజనశాలను చూసారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలల్లో మెనూ అమలు, ఉపాధ్యాయుల బోధన తీరు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, ఎంఈఓ తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

వివక్ష క్షమించరాని నేరం

వీరఘట్టం: సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్ష క్షమించరాని నేరమని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలిత కుమారి అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం కెల్ల రాము, సీసీలు ఆనంద్, ఉదయ్‌కుమార్, వీఓఏలు పాల్గొన్నారు.

సన్మానం..


విశ్రాంత టీచర్ ధర్మారావు దంపతులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

భామిని: మండలంలోని నేరడి – బి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సిరిగంటి ధర్మారావును మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, పీఆర్‌టీయూ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ధర్మారావు దంపతులను వారి తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు వి.హరిశ్చంద్రుడు, పప్పల రాజశేఖర్, కమిటీ సభ్యులున్నారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు

పాలకొండ రూరల్: కార్తీక బహుళ త్రయోదశిని పురస్కరించుకుని పలు శివాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భీమలింగేశ్వర ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేయగా.. నక్కలపేటలో కొలువైన మృత్యుంజయేశ్వర మరకత లింగేశ్వరిడ్ని వేలాది రుద్రాక్షలతో అభిషేకాలు చేశారు. సదాశివ, ఉమామహేశ్వర ఆలయాల్లో అష్టోత్తర శత బిల్వార్చన, దశ విధ హారతులు సమర్పించారు.

విద్యార్థుల వివరాలపై ఆరా..

వీరఘట్టం: మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయాన్ని సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ మధుకిశోర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని విద్యార్థుల వివరాలపై ఆరా తీశారు. దూరప్రాంత విద్యార్థుల వివరాలను ముందుకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంఈఓ ఆర్.ఆనందరావుకు సూచించారు.

ఇండస్ట్రియల్ విజిట్..


కుట్టు శిక్షణ కేంద్రంలో విద్యార్థినులు

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఐటీ, ఐటీఈఎస్ వృత్తివిద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులు శుక్రవారం ఇండస్ట్రియల్ విజిట్ చేశారు. హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ, మహిళా కుట్టు శిక్షణ కేంద్రం, వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయాలను సందర్శించి వారి విధులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని సచివాలయం, పాఠశాల, గిరిజన సంక్షేమ వసతిగృహం, పంచాయతీ కార్యాలయాన్ని డీపీఓ కొండలరావు శుక్రవారం పరిశీలించారు. వసతిగృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సచివాలయ సిబ్బందిని హౌస్ హోల్డ్ సర్వే ఎంత వరకు జరిగింది అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ ఎస్.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సహజ ఉత్పత్తులకు ప్రాధాన్యం


మధుబాబును సన్మానిస్తున్న నిర్వాహకులు

పాలకొండ రూరల్: వివిధ రూపాల్లో లభ్యమయ్యే సహజ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని పోస్ట్ డాక్టోరియల్ చైనా సంస్థలో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్.మధుబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సహజ ఉత్పత్తులు, రసాయన శాస్త్రంలో ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ముఖ్య అతిథి శాస్త్రవేత్త మధుబాబును సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌బాబు, ఎం.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● టైమ్‌టేబుల్ ఎఫెక్ట్..

తరగతుల నిర్వహణ ఎలా..?

- రేపటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పూటలా తరగతులు
- ఆదేశాలు జారీ చేసిన ఇంటర్ బోర్డు
- అదే కళాశాలలో ఉదయం డిగ్రీ తరగతుల నిర్వహణ
- సతమతమవుతున్న అధ్యాపకులు


జూనియర్ కళాశాలలోనే నిర్వహిస్తున్న డిగ్రీ తరగతులు (ఫైల్)

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, వీటిలో దాదాపు అన్నీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తున్నాయి. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల మాత్రం ఒక పూటే షిఫ్ట్ పద్ధతిలో పనిచేస్తోంది. డిసెంబర్ 1 నుంచి ఈ టైమ్‌టేబుల్ మార్చి, రెండు పూటలా తరగతులు నిర్వహించాలని ఇంటర్ బోర్డు కమిషనర్ కృతికా గురువారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో డిసెంబర్ ఒకటి నుంచి ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర ఐదు వరకు తరగతులు నిర్వహించేందుకు ప్రిన్సిపాల్ డీజీవీఎస్ త్రినాథ్ అధ్యాపకులతో శుక్రవారం సమావేశమై టైమ్‌టేబుల్ సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే ఇదే ప్రాంగణంలో ఉదయం పూట తరగతులు నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బందికి ఇంటర్ బోర్డు నుంచి వచ్చిన ఆదేశాలను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వివరించారు. దీంతో ఒకే కళాశాలలో ఇంటర్, డిగ్రీ తరగతులు ఎలా నిర్వహించాలో తెలియక అధ్యాపకులు తలలు పట్టుకుంటున్నారు.


వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల

పరాయిపంచన...

వీరఘట్టం మండల కేంద్రంలో 2008లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటికీ శాశ్వత భవనాల్లేక పరాయిపంచనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాల కోసం 2015లో నాబార్డు నిధుల నుంచి రూ.5.25 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో వీరఘట్టానికి సమీపంలోని మరియగిరి వద్ద ఐదెకరాల స్థలంలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పలుమార్లు నాబార్డు అధికారులు స్థలాన్ని పరిశీలించి మట్టి నమూనా పరీక్షలు కూడా చేశారు. అయితే అధికారుల నిర్లక్ష్యమో..అప్పటి ప్రిన్సిపాల్ అలసత్వమో తెలీదు కాని వచ్చిన నిధులు వచ్చినట్లే వెనక్కి మళ్లిపోయాయి. డిగ్రీ కళాశాల ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకు జూనియర్ కళాశాలలోనే ఉదయం పూట డిగ్రీ తరగతులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంటర్‌కు రెండు పూటలా తరగతులు నిర్వహించాలని ఆదేశాలు రావడంతో డిగ్రీ తరగతులు ఎక్కడ నిర్వహించాలన్న సమస్య నెలకొంది.


గదులు చాలక ఆరుబయట నిర్వహిస్తున్న ఇంటర్ తరగతులు

ఇదీ పరిస్థితి....

వీరఘట్టంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను దాతల సాయంతో 1982లో ఏర్పాటు చేశారు. కళాశాల ప్రారంభం నుంచి ఇక్కడ మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.15 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 202 మంది, సెకెండియర్ విద్యార్థులు 126 మంది చదువుతున్నారు. వీరికి తరగతులు, ల్యాబ్‌లకు సంబంధించి 18 గదులుండాలి. అయితే కళాశాలలో 8 గదులు మాత్రమే ఉన్నాయి.ఆ గదుల్లోనే తరగతులు, ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. గదులు చాలక నేటికీ ఇంటర్ విద్యార్థులకు ఆరుబయట తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే కళాశాలలో ఉదయం డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ఇంటర్‌బోర్డు నిర్ణయంతో అధికారులు,అధ్యాపకులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి : డిగ్రీ కళాశాల విద్యార్థులు

డిసెంబర్ 1 నుంచి ఇంటర్మీడియట్‌కు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తే, డిగ్రీ తరగతులు నిర్వహించడం చాలా కష్టమని విద్యార్థులు అంటున్నారు. స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో ప్రత్యామ్నాయంగా డిగ్రీ తరగతులు నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఈ హాస్టల్‌లో 16 మంది బాలురు ఉన్నారు. వీరు ఉదయం 8.45 గంటలకు పాఠశాలకు వెళ్లి మరలా సాయంత్రం 4.15 గంటలకు వస్తున్నారు. ఈ మధ్య కాలంలో డిగ్రీ విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు తరగతులు నిర్వహించుకునే అవకాశం ఉంది.

ఆదేశాలు పాటిస్తాం..

ఇంటర్ బోర్డు నుంచి వచ్చిన ఆదేశాలను తప్పకుండా పాటిస్తాం. ఈ విషయాన్ని డిగ్రీ కళాశాల వారికి కూడా తెలియజేశాం. మా తరగతులకు ఇబ్బంది లేకుండా సహకరించాలని కోరాం. అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చే ఇంటర్ విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తెచ్చుకోవాల్సి ఉంటుంది.
– డీజీఎస్‌వీ త్రినాథ్, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల, వీరఘట్టం

ఉన్నతాధికారులకు తెలియజేశాం

డిసెంబర్ 1 నుంచి ఇంటర్ తరగతులను రెండు పూటలా నిర్వహిస్తే, డిగ్రీ విద్యార్థులకు తరగతులు నిర్వహించడం చాలా కష్టం. ఈ విషయాన్ని యూనివర్సిటీ ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరగతులు ఎలా నిర్వహించాలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.
– సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వీరఘట్టం

● పరిశీలన..



సీతంపేటలోని ఏరియా ఆస్పత్రి భవనాలు, సూపర్ స్పెషాలిటీ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ సి. యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈయన వెంట సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, తదితరులున్నారు. – సీతంపేట

● అన్న సమారాధన...

పాలకొండ పట్టణంలోని కోమటిపేటలో కొలువుదీరిన శ్రీ మద్విరాట్ అన్నపూర్ణ సహిత సనారి విశ్వనాథ అవదూత ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. అంతకుముందు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాటు చేసినట్లు విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘ ప్రతినిధులు ప్రసాదరావు, రామకృష్ణ, అర్చకుడు ప్రసాద్ పాడి తెలిపారు. – పాలకొండ రూరల్



● కొనసాగుతున్న దీక్షలు..



గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. దీక్షా శిబిరాన్ని మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఉద్యోగుల న్యాయపరమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్.మోహనరావు, సర్పంచ్‌లు ఎస్.తిరుపతిరావు, ఎస్. సిమ్మయ్య, బి.తిరుపతిరావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు. –సీతంపేట

పంటకోత ప్రయోగాలతో దిగుబడుల నిర్ధారణ


పంటకోత ప్రయోగంలో వరి కంకులను పరిశీలిస్తున్న రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన వరిపంట దిగుబడులను నిర్ధారించుకొనేందుకే పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ తెలిపారు. మండలంలోని సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస గ్రామంలో ఎం.రేగంనాయుడు పొలంలో నవధాన్యాలతో సాగు చేసిన పంట దిగుబడులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సాగులో ఎకరాకు 30బస్తాలు దిగుబడి వస్తుందన్నారు. నవధాన్యాలు రైతులు వేసుకోవడం వల్ల ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభించడంతో పాటు ఏపుగా పెరిగి, పురుగులను, తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. డీపీఎం పి.షణ్ముఖరాజు, ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ, మాస్టర్ ట్రైనీ ఎం.స్వామినాయుడు తదితరులున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి..


మంగళాపురంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి మన్మథరావు

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో గ్రామీణ ప్రజలకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధక శాఖ జె.డి శివ్వాల మన్మథరావు అన్నారు. ఎంపీడీఓ ఎంవీ రంగారావుతో కలిసి శుక్రవారం ఆయన మండల పరిధిలోని చిన్న మంగళాపురం, యరకారాయపురం, గొట్ట మంగళాపురం గ్రామాలను సందర్శించారు. అక్కడి సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వనరులు, వైద్య, విద్యా వ్యవస్థల తీరుపై ఆరా తీశారు. ఈయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హన్సీ ప్రవళిక, సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి..


మాట్లాడుతున్న సీడీపీఓ సిమ్మాలమ్మ

పాలకొండ రూరల్: వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని బాల్య వివాహాలను అరికట్టాలని సీడీపీఓ బి. సిమ్మాలమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మండల పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, సచివాలయ అడ్మిన్లు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలకు కిశోరీ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్, ఐసీడీఎస్ విభాగ సభ్యులు శ్రీధర్, రాజశేఖర్, తదితరులు బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవాలని చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దశారత్నం, మేరీ, తదితరులు పాల్గొన్నారు.

గొట్టివలసలో భగవద్గీత పారాయణం


భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలసలో కొలువుదీరిన వీరబ్రహ్మేంద్రస్వామి, మృత్యుంజయస్వామి ఆలయ ప్రాంగణంలో భగవద్గీత పారాయణాన్ని శంబాన శ్యామసుందరరావు, చందక సింహాచలం వివరించారు. శుక్రవారం కార్తీకమాసం అమావాస్యను పురస్కరించుకొని భగవద్గీత పారాయణం, శివునికి అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు కె.గౌరీశ్వరరావుతో పాటు శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొని కార్యక్రమంలో పాల్గొన్నారు.

● అన్నదాతపై 'ఫెంగల్' పిడుగు..

ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను ఇంటికి చేర్చే సమయంలో ఫెంగల్ తుఫాన్ అన్నదాత నడ్డి విరిచింది. పాలకొండ డివిజన్‌లో చాలా చోట్ల వరి కోతలు పూర్తి కావడంతో కొంతమంది రైతులు పంటను కళ్లాలకు చేర్చగా.. మరికొంతమంది పొలంలోనే పనలుగా ఉంచేశారు. అయితే ఒక్కసారిగా వాతావరణం మారి శుక్రవారం ఉదయం నుంచి చినుకులు పడడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. నూర్పులు చేసిన వారు ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పగా.. పొలాల్లో కుప్పలు పెడుతూ మరికొంతమంది బిజీగా కనిపించారు. – పాలకొండ నెట్‌వర్క్


వీరఘట్టం: నడుకూరు వద్ద పొలంలో వరి కుప్పలు వేస్తున్న రైతులు


భామిని: గురండిలో బస్తాలపై టార్పాలిన్ కప్పుతున్న రైతు

ఆ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి..

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను గిరిజన గురుకుల పాఠశాలలకు డెప్యూటేషన్ వేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది రోజులుగా శాంతియుతంగా పోరాడుతున్న వీరి సమస్యలను పరిష్కరించకుండా వారిని భయపెట్టి మరింత ఆందోళనకు గురి చేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికల ముందు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకుంటామని, మేలు చేస్తామని హామీలు, వాగ్దానాలు ఇచ్చి ఇప్పుడేమో వారి ఉద్యోగాలకు ఎసరుపెట్టే చర్యలు ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుని వారి సమస్యలు పరిష్కారం చేయాలని లేకుంటే అన్ని గిరిజన, ప్రజా సంఘాలను కలుపుకుని గిరిజన శాఖ మంత్రి ఇంటి ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నేడు ఉపకరణాల గుర్తింపు శిబిరం

భామిని: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల గుర్తింపు శిబిరం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పోలిపాడ్యమికి ఏర్పాట్లు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో డిసెంబర్ 1న ఆదివారం అర్ధరాత్రి తెల్లవారితే సోమవారం పోలిపాడ్యమికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నాగావళి తీరం చదును చేసి భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ కార్తీకమాసం ముగింపు సందర్భంగా నాగావళి నదికి పుణ్య హారతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నాగావళి నదీ తీరంలో విద్యుత్ అలంకరణలు చేయనున్నట్లు చెప్పారు.

సహాయ ఉపకరణాల శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే


ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పార్వతీపురం మన్యం జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అలిమ కో సంస్థ సహకారంతో శుక్రవారం నిర్వహించిన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణముల పంపిణీ కోసం చేపట్టిన గుర్తింపు శిబిరాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. కురుపాం నియోజకవర్గం పరిధిలోని 5 మండలాల నుంచి వచ్చిన వయోవృద్ధులు మరియు విభిన్న ప్రతిభావంతుల్లో 161 మందిని ఆయా ఉపకరణాల కోసం ఎంపిక చేసినట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ కె.కవిత తెలిపారు. ఈ మేరకు వీరికి ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, చేతి కర్రలు వంటి ఉపకరణాలు త్వరలో అందజేయనున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్ రమణమ్మ, యస్ సొసైటీ కార్యదర్శి ఎస్.కె.గౌష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దోమ తెరల పంపిణీ


విద్యార్థులకు దోమ తెరలు అందజేస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొరడ గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య శుక్రవారం దోమ తెరలను అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి ఆ పాఠశాలలో ఉన్న ఆయన విద్యార్థులు దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి.. సమీపంలో గల రేగిడి పీహెచ్‌సీ లోంచి దోమ తెరలను తెప్పించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రతీ రోజూ వినియోగించుకుని దోమల నుంచి రక్షణ పొందాలని సూచించారు. బాగా చదువుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, సర్పంచ్ పి.అమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అందరి ఆమోదంతోనే..



పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎంపిక అందరి ఆమోదంతోనే ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరుగుతుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇటీవల చైర్మన్ యందవ రాధాకుమారి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసినదే. ఆమె రాజీనామాను కౌన్సిల్స్‌లో ఆమోదించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఎంపిక కోసం చర్చించారు. నగరపంచాయతీలో 20 వార్డులుంటే అందులో 17 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లే ఉన్నారు. ప్రస్తుతం ఇద్దరు వైస్‌చైర్మన్లు ఉండగా.. అందులో ఒకరిని చైర్మన్‌గా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. పాలకవర్గం ఇచ్చిన పేర్లను ఉన్నతాధికారులకు అందించి వారి ఆదేశాలు పాటిస్తామని కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. – పాలకొండ

▶▶ అంచనా బడ్జెట్ ఆమోదం

కొమరాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి శ్యామల అధ్యక్షతన శుక్రవారం 2024 – 25, 2025 – 26 సంవత్సరాలకుగాను అంచనా బడ్జెట్ ఎంపీడీఓ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఆమోదించారు. సమావేశంలో జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

▶▶ 5న మండల సమావేశం

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో డిసెంబర్ 5న మండలాధ్యక్షుడు ఉరిటి రామారావు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి శుక్రవారం తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు. మండల అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరు కావాలని కోరారు.

▶▶ పట్టుబడిన సారా ప్యాకెట్లు

కొమరాడ: ఆర్తాం సమీపంలో 400 సారా ప్యాకెట్లతో శుక్రవారం ఓ వ్యక్తి పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో గుమడ గ్రామానికి చెందిన వెలగాడ సింహాద్రి సారా ప్యాకెట్లను మోటారుసైకిల్‌పై రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సింహాద్రిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.